
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
గురువారం 25 జనవరి 2024



ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా

తాండూరు, జనవరి24: పాఠశాలలో విద్య కమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈనెల 29న ఎస్ఎంసీ కొత్త కమిటీకి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నుకోవాల్సి ఉంది. ఇప్పటికే పేరెంట్స్ లిస్ట్ ప్రకటన పూర్తి, అభ్యంతరాల స్వీకరణ పూర్తి చేశారు. అయితే ఎన్నికలు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వాయిదా వేయాలని ప్రభుత్వం పాఠశాల విద్యా కమిషనర్ ద్వారా పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేశారు. పాత ఎస్ఎంసీ కమిటీలను రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందన్నారు.

ఉమ్మడి జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. నిన్న మొన్నటి వరకున్న అసెంబ్లీ ఎన్నికల వేడి తగ్గుతున్న తరుణంలో లోక్‌సభ ఎన్నికలు మళ్లీ రాజకీయ వేడిని రగిలిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ పరంపర సాగించి అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న రెండు లోక్‌సభ స్థానాలనూ కైవసం చేసుకునేందుకు వేగంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని స్థానాలను గెలిచిన బీఆర్ఎస్‌ను ఈ సారి కోలుకోలేని దెబ్బతీసేలా వ్యూహం పన్నుతోంది. ఆ పార్టీకి చెందిన కీలక నేతలను కారు దించి హస్తం వైపు మళ్లించే పనిలో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారు. దీంతో ఈసారి రాజకీయ సమీకరణలు ఎలా ఉంటాయోనన్న ఆసక్తి ఉమ్మడి జిల్లా వాసుల్లో నెలకొంది.



- చకచకా పావులు కదుపుతున్న కాంగ్రెస్
- ఎమ్మెల్యేలు, కీలక నేతలే టార్గెట్
- పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఆపరేషన్ ఆకర్ష్
- మల్కాజిగిరి, చేవెళ్లకు ఇద్దరు కీలక నేతల పేర్లు పరిశీలన

గులాబీపై గురి!

బీఆర్ఎస్‌కు త్వరలో భారీ కుదుపు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలు కొంత ముందస్తుగానే జరిగే అవకాశం ఉండడంతో అధికార కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో మరింత బలపడేందుకు కసరత్తు మొదలు పెట్టింది. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలను తమ వైపు తిప్పుకునేందుకు 'ఆపరేషన్ ఆకర్ష్'ను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల పరిధిలో బీఆర్ఎస్ కంటే వెనుకబడిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల నాటికి పూర్తి స్థాయిలో పుంజుకుని ఈ రెండు స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యర్థులను తమ వైపు తిప్పుకునేందుకు అన్ని వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్‌కు ఆర్థికంగా నిలబడే బలమైన నేతలు లేరు. దీంతో అభ్యర్థుల ఎంపిక విషయంలో కూడా తర్జనభర్జన పడుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్థికంగా బలమైన బీఆర్ఎస్‌కు చెందిన ఓ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకుని వీరిద్దరికీ మేడ్చల్, మల్కాజిగిరి లోక్‌సభ టికెట్లు ఇస్తున్నట్లు రెండు రోజులుగా ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కుటుంబంతో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు మంతనాలు జరిపారు. వాస్తవానికి ఎన్నికలకు ముందుగానే వారిని కాంగ్రెస్‌లో రప్పించే ప్రయత్నాలు జరిగినప్పటికీ అప్పటికే మహేందర్‌రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి కొడంగల్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. దీంతో పాటు మహేందర్‌రెడ్డి పార్టీ మారకుండా కట్టడి చేసేందుకు ఆయనకు బీఆర్ఎస్ మంత్రి పదవి ఇవ్వడంతో ఆయన వెనక్కి తగ్గారు. ఆయన మంత్రి అయిన తరువాత కూడా కాంగ్రెస్ నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. మంత్రి పదవి ఇవ్వడమే కాక ఆయన సతీమణి వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు ఆఫర్ ఇచ్చారు. అయితే ఎన్నికలకు కొద్ది రోజులే గడువు ఉండడంతో మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి బీఆర్ఎస్‌లోనే కొనసాగారు. అయితే, ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మహేందర్‌రెడ్డికి కాంగ్రెస్ నుంచి ఆహ్వానం అందింది. అయితే ఎంపీ సీటు మహేందర్‌రెడ్డికి ఇవ్వాలా? లేక ఆయన సతీమణి సునీతారెడ్డికి ఇవ్వాలా? అనే దానిపై కాంగ్రెస్‌లో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. సునీతారెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా రెండు దఫాలు ఎన్నికయ్యారు. దీంతో ఆమె పేరును కూడా కాంగ్రెస్ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం తాండూరు మున్సిపల్ చైర్మన్ పీఠం మహేందర్‌రెడ్డి వర్గం చేతిలో ఉంది. వీరంతా ఇవుడు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. దీన్ని బట్టి చూస్తే మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం లాంఛనమేనని ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంపై అనేక మంది చూపు ఉన్నప్పటికీ ఇక్కడ నుంచి బీఆర్ఎస్, బీజేపీ నుంచి బలమైన వ్యక్తులు రంగంలో దిగే అవకాశం ఉండడంతో అధికార కాంగ్రెస్ కూడా ధీటైన అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్‌కు ఇది సిట్టింగ్ స్థానం కావడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించినందున ఈ సీటును కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. దేశంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చు కూడా అదే స్థాయిలో ఉంటుంది. ప్రధాన పార్టీలు ఒక్కొక్కటీ కనీసం రూ. 100 కోట్లకు పైగానే ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్థికంగా బలమైన వ్యక్తిని రంగంలో దింపాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల పేర్లు పరిశీలనలో ఉన్నా ఆర్థిక మూలాలు బలంగా ఉన్న బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే వైపే కాంగ్రెస్ నాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉక్కిరి బిక్కిరి!

ఇదిలా ఉంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అధికార కాంగ్రెస్ ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. వారిని నేరుగా పార్టీలోకి ఆహ్వానించకుండానే వారి చుట్టూ ఉన్న బలమైన నేతలను కాంగ్రెస్‌లోకి రప్పించుకునే యత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్, కార్పొరేషన్ పీఠాలపై గురిపెట్టింది. దీంతో అనేకచోట్ల అవిశ్వాస తీర్మానాలు మొదలయ్యాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలియక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా అవినీతి అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగోతాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తవ్వి తీస్తోంది. ముఖ్యంగా నగర శివార్లలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నేరుగా, లేదా ప్రత్యక్షంగా చేసిన భూ దందాలపై దృష్టి సారించింది. వీటి సమాచారం సేకరించి అంతర్గత విచారణ కూడా మొదలు పెట్టింది. దీంతో అప్పట్లో భూ దందాల వెనుక ఉన్న బీఆర్ఎస్ నేతల్లో గుబులు మొదలైంది.

కాంగ్రెస్‌లోకి తాండూరు బల్దియా చైర్‌పర్సన్!

- సొంత పార్టీ వారే అవిశ్వాసంపై కినుక
- అదే బాటలో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు


తాటికొండ స్వప్న

తాండూరు, జనవరి 24 : తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న బీఆర్ఎస్ పార్టీని విడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆమెతో పాటు ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు పార్టీని వీడనున్నారు. నేడో, రేపో చేరేందుకు ఇప్పటికే కాంగ్రెస్ ముఖ్య నేతలతో చర్చలు జరిపారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అవిశ్వాసం పెట్టేందుకు వైస్‌చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపా నర్సింహులును ప్రోత్సహిస్తున్నారని, ఇప్పటికే అవిశ్వాసం నోటీసు ఇచ్చేందుకు మెజార్టీ కౌన్సిలర్లు సంతకాల సేకరణ జరుగుతుండటంతో కినుక వహించిన స్వప్న రాజీనామాకు సిద్ధమయ్యారు. ఇటీవల మాజీ మంత్రి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి చైర్‌పర్సన్ స్వప్న ఇంటికి వెళ్లి చర్చలు జరపడం కూడ రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుపతి వెళ్లిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఈనెల 25 గురువారం రానున్నారు. ఎమ్మెల్యేతో చర్చలు అనంతరం గణతంత్ర దినోత్సవం తర్వాత ఎప్పుడైనా కాంగ్రెస్‌లో చేరనున్నారు. కాంగ్రెస్ మద్దతుతో ఆమె చైర్‌పర్సన్‌గా కొనసాగే ప్రయత్నాలు జరుగుతున్నాయి.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఉద్యాన సాగుతో ఆర్థికంగా ఎదగాలి

- అన్ని విధాలుగా సాగుకు అనుకూలం వికారాబాద్
- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి24 : వికారాబాద్ ప్రాంతం అన్ని పంటలను సాగు చేసేందుకు అనుకూల వాతావరణం ఉందని, రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మామిడిసాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ బి.నీరజ ప్రభాకర్, శాస్త్రవేత్తలు, అధికారులతో కలెక్టర్ జ్యోతి చేసి మాట్లాడారు. ఉద్యాన పంటల సాగులో సైంటిస్టుల, అధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటూ పంటల దిగుబడులను పెంచుకుంటూ లాభాలబాటలో కొనసాగాలన్నారు. భవిష్యత్తులో వికారాబాద్ జిల్లా అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని, ఇప్పటికే జిల్లాలో 13 వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి సాగు జరుగుతుందని తెలిపారు. అనంతగిరి రైతు ఉత్పత్తి సంస్థ ద్వారా మామిడి పండ్లను దేశ, విదేశాలకు కూడా ఎగుమతి చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ నిరజాప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో కూరగాయలు, పూలు, పండ్ల సాగు విస్తీర్ణం పెంచాలని తెలిపారు. అంతర్ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అంతకు ముందు వికారాబాద్ పట్టణంలోని హార్టికల్చర్ నర్సరీని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సంచాలకులు భగవాన్, జిల్లా అధికారి చక్రపాణి, ఆర్‌పీ నాయుడు, మధుసూదన్, ఉద్యాన శాఖ అధికారులు కమల, వైజయంతి, అర్చన, విజయ్‌కుమార్, బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారిణి గుత్తాజ్వాల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊరడమ్మకు బోనాలు

పెద్దేముల్, జనవరి 24 : రుక్మాపూర్ గ్రామంలో గ్రామదేవత జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. ఊరడమ్మకు బోనాల సందర్భంగా ఊరంతా బంధువులు, ఆడపడుచులతో నిండిపోయింది. అమ్మవారికి ఉదయం గ్రామస్తులు పూజలు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. ఊరు సల్లంగ ఉండాలని, పాడి, పంటలు బాగుండాలని మొక్కుకున్నారు. పోతురాజులు చేసిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఏర్పుల సాని భవిష్యవాణిని వినిపించారు.

బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



ఆడపిల్లను భారంగా చూడొద్దు

- జడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


బాలికా దినోత్సవంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

బషీరాబాద్, జనవరి24 : ఆడపిల్ల పుడితే భారంగా చూడకుండా ఇంట్లో మహలక్ష్మి పుట్టిందని తల్లిదండ్రులు సంబరపడాలని వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బషీరాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు)లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలను లింగభేదం లేకుండా ఉన్నత చదువులు చదివించాలన్నారు. ప్రభుత్వం బాలికల చదువును ప్రోత్సహిస్తోందని, పదోతరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. అంతకు ముందు బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె కేక్ కట్ చేశారు. ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, హెచ్‌ఎం హీర్యానాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ

మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ బాలికలను ముందుకు నడిపించేందుకు చేపటాల్సిన చర్యలను వివరించారు. 'బాలికలకు రక్షణ కల్పిద్దాం, వారి బంగారు భవితకు పునాది వేద్దాం, స్వేచ్ఛాయుతమైన వాతావరణం కల్పిద్దాం' అని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడబ్ల్యుసీ కమిటీ చైర్‌పర్సన్ రాజారెడ్డి, , డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, డీఈవో, సీడీపీవోలు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జనవరి 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించినట్లయితే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాట్రాన్స్‌పోర్టు అధికారి కిషన్‌తో కలిసి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల-2024 కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14 వరకు ఈమాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించాల్సిన బాధత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం కావడం బాధాకరమన్నారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపరాదని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, జనవరి24 : సీఎం ప్రత్యేక దృష్టితో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయని, అందుకోసం లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేయిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఈ ప్రాంత పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. విద్యుత్, వ్యవసాయం, సమావేశంలో ఎంపీడీవో పాండు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈవో రాంరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

1,91,120 ఓటరు నమోదుకు దరఖాస్తులు

- ఫిబ్రవరి 8న తుది జాబితా



మేడ్చల్ జనవరి 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 20,21 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 1,91,120 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కొత్తగా ఓటరు నమోదుకు(ఫారం-6) 1,03,688 దరఖాస్తులు వచ్చాయి. పేర్లు తొలగింపు(ఫారం-7) 37,139, మార్పులకు (ఫారం-8) 50,293 దరఖాస్తులు వచ్చాయి. ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా ఈనెల 6న ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేసిన అధికారులు అదే రోజు నుంచి ఫిబ్రవరి 2 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. అదేనెల 8న ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు. కాగా నేడు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కూకట్‌పల్లి జెఎన్టీయూలో జరిగే ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై, రాష్ట్ర ఎన్నికల ప్రధానఅధికారి వికాస్‌రాజ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు.

పరిగి ఆస్పత్రికి మహర్దశ!

- రూ. కోటితో ఆస్పత్రి విస్తరణ పనులు
- 30 నుంచి 100 పడకలకు పెంపు
- అందుబాటులో స్పెషలిస్టు వైద్యులు
- 24 గంటలు వైద్య సేవలు


పరిగి,జనవరి 24 : పరిగిలోని ప్రభుత్వ అస్పత్రిలో రూ.కోటితో విస్తరణ పనులు చేపట్టనుండటంతో దవాఖానా రూపురేఖలు త్వరలో మారనున్నాయి. ఈ నిధులతో వివిధ విభాగాలలో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, మరిన్ని వైద్య సేవలు అందించేందుకు అధునాతన పరికరాలు, బెడ్లు, అందుబాటులోకి రానున్నాయి. వందపడకలతో త్వరలో ఏరియా ఆస్పత్రిగా కూడా మారనుంది. ఐదు బెడ్లతో ఐసీయూ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. రూ.60 లక్షలతో ఎక్స్‌రే, అనస్థీషియా, ఇతర విభాగాలకు అసరపడే పరికరాలు, రూ.10లక్షలతో మిగిలిన పనులు పూర్తి చేస్తారు. మార్చురీ, ప్రహరీ నిర్మాణ పనులు త్వరలోనే చేపట్టనున్నారు. మిగతా నిధులతో డాక్టర్లకు, సిబ్బందికి విశ్రాంతి గది, మరుగుదొడ్లను ఏర్పాటు చేయబోతున్నారు.


పరిగిలోని సీహెచ్‌సీ అస్పత్రి

అందుబాటులో స్పెషలిస్టు వైద్యులు

ప్రస్తుతం ఉన్న 30 బెడ్ల సంఖ్య వందకు పెరుగనుంది. అనంతరం జిల్లా మెడికల్ కళాశాలకు అనుసంధానం చేసి, నిపుణులైన వైద్యులతో సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏరియా ఆస్పత్రిగా మారితే సివిల్‌సర్జన్ స్థాయి సూపరింటెండెంట్‌తోపాటు, అన్ని విభాగాల ప్రత్యేక వైద్యనిపుణులు అందుబాటులో ఉండనున్నారు. నలుగురు గైనకాలజిస్ట్‌లు, ఆర్థోపెడిక్, కార్డియాలజిస్ట్, స్కిన్, జనరల్ సర్జన్, ఈఎన్‌టి, యూరాలజీ, ప్రిడియాసిస్ట్, డయాబెటాలజిస్ట్ లాంటి 25 మంది వైద్య పోస్టులు, మరో 25 మంది స్టాఫ్ నర్సులు, నర్సులు, 40 పారామెడికల్ సిబ్బందిని నియమించనున్నారు. అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. వివిధ రకాల ఆపరేషన్‌లు కూడా చేయనున్నారు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లాలసిన అవసరం ఉండదని వైద్యాధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారికి చేరువలో ఉండడంతో ఎక్కువగా రోడ్డు ప్రమాద కేసులు వస్తున్నాయి. ఇక నుంచి ఇక్కడే అన్ని రకాల వైద్య సేవలు అందించనున్నారు.

అందుబాటులోకి అన్ని రకాల సేవలు



ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన నిధులను వెచ్చిస్తాం. ప్రస్తుతం రూ.కోటితో విస్తరణ పనులు చేపడుతున్నాం. మరిన్ని నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతా. వందపడకల ఆస్పత్రిగా మారుస్తాం. దాంతో అన్ని వైద్యసేవలు, నిపుణులైన డాక్టర్లు అందుబాటులోకి వస్తారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తా.

- డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే,పరిగి

తాండూరు రూరల్, జనవరి 24 : చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం తాండూరు మండలం 33గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చనిపోయిన, పెళ్లయి వెళ్లిపోయిన వారి వివరాలను రెవెన్యూ అధికారులకు అందజేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాను సవరిస్తున్నారు. పీఎస్‌లు లాలప్ప, ఇస్మాయిల్, ఆనంద్‌రావు ఓటరు లిస్టుల వివరాలను అందజేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఓటరు జాబితాలో పేర్లు సరిచేసి కొత్తగా జాబితా సిద్ధం చేస్తున్నారు.

ఓటరు జాబితాల్లో పేర్ల తొలగింపు షురూ



ఉప్పల్ భగాయత్‌లో రజక ఆత్మగౌరవభవన్ నిర్మించాలి



మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కీసర రూరల్, జనవరి 24 : రజక ఆత్మగౌరవ భవన్‌ను ఉప్పల్ భగాయత్‌లో నిర్మించాలని బుధవారం వెనుక బడిన తరగుతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సచివాలయంలో కలిసి మాజీ మంత్రి బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రజక సంఘాల ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ శాఖల్లో రజక వృత్తికి సంబంధిచిన ఉద్యోగాలను, పనులను వారికే కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్వరాజు శంకర్, ఆంజనేయులు, సంపత్, శ్రీనివాస్, రమేష్, కుమారస్వామి, రమేష్, బ్రహ్మయ్య, గంగాధర్, రాములు పాల్గొన్నారు.

సర్వే ల్యాండ్ రికార్డ్స్ యూనియన్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ జనవరి 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీఎస్జీఓస్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ యూనియన్ 2024 డైరీని బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. యూనియన్ అధ్యక్షుడు నరహరిరావు, సర్వే డిపార్ట్మెంట్ సమస్యలపై మంత్రికి వివరించగా వాటి పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారని యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎం.రాంచందర్, వి.శ్రీరామ్ పాల్గొన్నారు.

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్‌ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.


బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో్స్‌లో వచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్‌ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన ఆడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాముల వారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత ఆడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అద్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్థక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్‌ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్లు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

కొత్తగా యూ టర్న్ ప్రారంభం

మేడ్చల్ టౌన్, జనవరి 24: మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద మూసివేసిన పాత యూటర్న్‌లకు బదులుగా అధికారులు హైవేపై మరో చోట యూటర్న్‌ను ఏర్పాటు చేశారు. దీంతో వారం రోజులుగా చెక్‌పోస్టు, గండిమైసమ్మ, కిష్టాపూర్ కూడళ్ల వద్ద నెలకొన్న ట్రాఫిక్ జామ్ సమస్యకు పరిష్కారం లభించింది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చెక్‌పోస్టు వద్ద ఉన్న రెండు యూటర్న్‌లను మూసివేశారు. రింగ్ రోడ్డు వైపు నుంచి, గండిమైసమ్మ వైపు నుంచి వచ్చే తాజాగా వాహనాలు యూటర్న్ తీసుకొని కిష్టాపూర్ మీదుగా రాజీవ్ హైవేకు వెళ్లేలా వీలు కల్పించారు. అలాగే ఎస్జీవో కాలనీవాసులు సైతం ఈ యూటర్న్ వద్ద రోడ్డు దాటే వీలు కల్పించారు. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా సిగ్నళ్లు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు.


హైవేపై కొత్తగా పెట్టిన యూ టర్న్

గ్రామ స్వరాజ్యమే ధ్యేయం


మర్రిపల్లిగూడ పంచాయతీ భవన ప్రారంభోత్సవంలో జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 24: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యం అని జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. రూ.40లక్షలతో నిర్మించిన మర్రిపల్లిగూడ, మాధారం గ్రామపంచాయతీ భవనాలను బుధవారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎంపీపీతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మర్రిపల్లిగూడ పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామాలకు అధిక నిధులు కేటాయించి మౌలిక సదుపాయాల కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. జెడ్పీ నిధుల నుంచి 61 పంచాయతీలకు రూ.18కోట్లు మంజూరు చేసి అభివృద్ధిలో భాగస్వాములమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌లు మంగమ్మ, యాదగిరి, ఉపసర్పంచ్‌లు రవికుమార్, నరేష్, ఎంపీటీసీలు శోభారాణి, సరళా కుమార్, వార్డు సభ్యులు లత, సుగుణ, సాయికుమార్, లక్ష్మమ్మ, మంజుల, ఆనంద్, అధికారులు నందకిశోర్, జగపతిబాబు, శ్రీనివాస్, రామ్మోహన్, నాయకులు ధర్మారెడ్డి, ఎండీ ఇక్బాల్, ముస్తఫా, కె.కుమార్, బి.కుమార్, దామోదర్‌రెడ్డి, ఎం.రవి, వెంకటేష్, శ్రీకాంత్, శ్రీశైలం, జనార్దన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ వివాదం

- శిలాఫలకంపై కనిపించని ఇన్‌చార్జి మంత్రి పేరు



ఘట్‌కేసర్ రూరల్, జనవరి 24: మాధారం, మర్రిపల్లిగూడ పంచాయతీ భవనాల ప్రారంభోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేరు వేయలేదు. అధికారుల తీరుపట్ల కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు ప్రొటోకాల్ తెలియకపోవడం దారుణమని, ఇంకా బీఆర్ఎస్ పాలనలో ఉన్నారనుకుంటున్నారని కాంగ్రెస్ నాయకుడు కందుల కుమార్ ఎద్దేవా చేశారు. దీనిపై పీఆర్ ఏఈ జగపతిబాబును వివరణ కోరగా పంచాయతీ భవనాల శిలాఫలకాలపై ఇన్‌చార్జి మంత్రి పేరు రాయకపోవడం తప్పిదమేనని, శిలాఫలకాలను మార్చి కొత్తవి ఏర్పాటు చేస్తామని తెలిపారు.

క్రీడలతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 24: క్రీడలతో క్రీడాకారులకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు లభిస్తుందని జేఎన్టీయూ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎస్ఎస్.దిలీప్ అన్నారు. జేఎన్టీయూహెచ్ బేస్‌బాల్ సెలెక్షన్ అవుషాపూర్ వీబీఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం ప్రారంభమయ్యాయి. వివిధ ఇంజినీరింగ్ కాలేజీల నుంచి 45మంది బేస్‌బాల్ క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. సెక్రటరీ మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఈ ఎంపికలు పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీబీఐటీ ప్రిన్సిపాల్ వీవీఎస్ శ్రీనివాస్, జేఎన్టీయూహెచ్ పీడీ అశోక్, వంశీ, మోహన్, వీబీఐటీ పీడీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.


విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్‌ల పంపిణీ


విద్యార్థులకు గైడ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

కొడంగల్ రూరల్, జనవరి 24 : ఉర్దూ మీడియం టెన్త్ విద్యార్థులకు ఎంఐఎం పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ ఆధ్వర్యంలో ఆల్ ఇన్ వన్ గైడ్‌లను పంపిణీ చేశారు. బుధవారం కొడంగల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్‌లోని బహదూర్‌పు ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన చేతుల మీదుగా గైడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదువుతూ తల్లిదండ్రుల ఆశయసాధన కోసం ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ఖలీల్ అహ్మద్, ఎండీ.మజహర్, ఎండీ.కరీం, షేక్ అహ్మద్, ఖాలేద్, సయ్యద్ ముస్తఫా, అబిద్, రోమన్, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి


పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, జనవరి 24: గణతంత్ర దినోత్సవాలను ఎస్పీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 26న ఉదయం 9గంటలకు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో గణతంత్ర వేడుకల ఏరాట్లను ఎస్పీ కోటిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్య అతిథి సందేశం, పోలీసు గౌరవ వందనం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల అభివృద్ధి పనుల స్టాల్స్, వీఐపీ, మీడియా ప్రతినిధులకు సంబంధించిన గ్యాలరీల ఏర్పాటు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందజేత తదితరులు కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. పరిశీలనలో ఎఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో కృష్ణన్, వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ ఏవో అమరేందర్, మున్సిపల్ కమిషనర్ జకీర్‌అహ్మద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తాం


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

శామీర్‌పేట, జనవరి 24 : తూంకుంట మున్సిపాలిటీ న్యూ కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని కాలనీ ప్రెసిడెంట్ గోపు శ్రీనివాస్, కాలనీ వాసులు అన్నారు. బుధవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పోతాయిపల్లి న్యూ కాలనీ సమస్యలపై స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కాలనీలో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. నాలుగేళ్లుగా తాము అక్కడ నివాసం ఉంటున్నామని తెలిపారు. కాలనీ వాసులం సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటునామని ఆవేదన వ్యక్తం చేశారు. గత డిసెంబరులో కార్యాలయం ఇన్‌వార్డులో ఫిర్యాదు చేశామని, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు లేవని, పారిశుధ్య కార్మికులతో కాలనీలో శుభ్రం చేయించాలని కోరారు. తమ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. లేకుంటే కాలనీలో ఉంటున్న కుటుంబాల్లోని చిన్నాపెద్దా కలిసి నిరసన కార్యక్రమాలకు చేపడుతామని మహిళలు, కాలనీ పెద్దలు అధికారులతో చెప్పారు. కార్యక్రమంలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ అరుణ్‌నాయక్, జనరల్ సెక్రటరీ రవికుమార్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

బాల, బాలికలిద్దరినీ సమానంగా పెంచాలి


విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న అధికారి లలితకుమారి

పూడూరు, జనవరి 24 : పూడూరులోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో బుధవారం జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు బాల, బాలికలను ఇద్దరినీ సమానంగా పెంచాలని, కూతురు, కొడుకు ఇద్దరూ సమానమే అన్నారు. వారు చదువినంత వరకు చదివించడం మన అందరి బాధ్యత అన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలకు చిన్నప్పటి నుంచే విద్యతోపాటు సామాజికాంశాలపై అవగాహన కల్పించాల సూచించారు. బాలికలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్య, వైద్య పరంగా ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో 'బేటీ బచావో-బేటీ పడావో' ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైల్డ్‌డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరమ్మ, మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ బలరాం, జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మి, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ రాజు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఫాతిమాబేగం, టీచర్లు పాల్గొన్నారు.


బొంరాస్‌పేట్: విద్యార్థినులకు బహుమతుల అందజేత

బొంరాస్‌పేట్: బాలిక చదువు సమాజానికి వెలుగు అని రామకృష్ణ సేవా సమితి సభ్యులు అన్నారు. చెట్టుపల్లి తండా కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ.. స్త్రీ, పురుష అసమానతలు తగ్గాలని, బాల్యవివాహాల నివారణకు ప్రతొక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, సేవా సమితి ప్రతినిధులు చంద్రశేఖర్, గోపాల్, వెంకట్, టీవీవీ రవీందర్‌గౌడ్, రాధిక, టీచర్లు పాల్గొన్నారు.

పెద్దేముల్: ఆడపిల్లల పట్ల వివక్షకు తావులేకుండా అందరం కృషిచేయాలని బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటేష్ అన్నారు. మారెపల్లిలోని కేజీబీవీలో జాతీయ బాలికాదినోత్సవాన్ని జరుపుకున్నారు. ముఖ్యఅతిథి వెంకటేష్ మాట్లాడుతూ.. బాలురు, బాలికల మధ్య అసమానతలను దూరం చేసేలా ప్రజల్లో అవగాహన కల్గించాలన్నారు. బాలికల పరిస్థితులను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, సంగమేశ్వర్, కేజీబీవీ స్పెషలాఫీసర్ రాజేశ్వరి, చైల్డ్‌ప్రొటెక్షన్ సిబ్బంది లక్ష్మణ్, వనమాల, వీరమ్మ పాల్గొన్నారు.


పెద్దేముల్‌లో..

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న పద్మాజారాణి, మంజుశర్మ

కీసర, జనవరి 24: మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ డీఆర్డీవో పద్మాజారాణి అన్నారు. బుధవారం కీసరలోని రైతు వేదిక వద్ద ఎస్‌బీఐ అధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందజేశారు. కార్యక్రమానికి పద్మాజారాణి, కోఠి జోన్ ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ మంజు శర్మ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్‌బీఐ ద్వారా తీసుకునే రుణాలతో మహిళలు ఉపాధి పొందుతూ తిరిగి సకాలంలో చెల్లించాలని సూచించారు. రుణాల ద్వారా వ్యాపారమే కాకుండా డబ్బును పిల్లల ఉన్నత చదువుల కొరకు, ఇతర రంగాలకు కేటాయించుకోవాలని సూచించారు. రుణమేళా ద్వారా కీసర, ఘట్‌కేసర్ మండలాల్లో 180 సంఘాలను రూ.15కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం జెనా, ఆర్ఎం విజయసారథి, చీర్యాల్, ఘట్‌కేసర్, కీసర, కొర్రెముల బ్రాంచ్‌ల మేనేజర్లు కిరణ్‌కూమార్, ఆకాంక్ష, వేణు, అనురుధ్, డీపీఎం ప్రభాకర్, లత, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి

మేడ్చల్ టౌన్, జనవరి 24: రోడ్డు ప్రమాదాలు అరికట్టాలంటే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రిటైర్డ్ ఆర్టీఏ విజయపాల్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని స్ఫూర్తి జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు రోడ్డుభద్రతపై అవగాహన ఉండాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ ధారణ తదిత రాలపై వివరించారు. భద్రతా నియమాలకు లోబడి వాహనాలు నడిపితే ప్రమాదాలను అరికట్టొచ్చన్నారు. యువకులు ర్యాష్ డ్రైవి ంగ్ పాటు హెల్మెట్ ధరించకుండా రైడింగ్ చేసి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం సభ్యులు కమలాకర్‌రెడ్డి, దేవరాజ్, గణేష్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


విజయపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

సంక్షిప్తంగా...

● **పూడూరు:** మండల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలను ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ బీనీరజ, పరిశోధన సంచాలకుడు ఎ.భగవాన్ బుధవారం సందర్శించారు. అంగడిచిట్టెంపల్లి రైతు పూర్ణ వ్యవసాయ క్షేత్రంలోని పాలిహౌస్, పూడూరులోని రైతు మధుసూదన్ మామిడి తోటలో పర్యటించారు. మామిడి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలు గ్రామాల రైతులు తమ సమస్యలను వివరించారు. మామిడిలో ఉల్లెడ పురుగు, పండు ఈగ, తేనె మంచుపురుగు, డైబ్యాక్ తెగులు తదితర సమస్యలను ఎదుర్కొంటున్నామని వాపోయారు. కార్యక్రమంలో సెరీకల్చర్ అధికారి వి.మధుసూదన్, బి.చక్రపాణి, డీస్ ప్రశాంత్, ఏవో తులసీరాం పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** తమ పట్టా భూముల్లో పనులు కొనసాగించొద్దని రైతులు తహసీల్దార్‌ను కోరారు. జినుగుర్తిలో సర్వే నంబర్-206లో భూమి సేకరించి పారిశ్రామికవాడకు కేటాయించారు. తమకు పరిహారం ఇవ్వలేదని చిన్న బాలప్ప, నర్సింహులు తహసీల్దార్‌కు తెలిపారు.

కులకచర్ల: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. మందిపాల్ ఉన్నత పాఠశాలలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. జీవో317తో నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలన్నారు.

● **వికారాబాద్:** బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మాధవరెడ్డి బాధ్యతలు చేపట్టంతో హైదరాబాద్‌లో పార్టీ పెద్దలను జిల్లా నాయకులతో వెళ్లి కలుసుకున్నారు. ఎంపీలు బండి సంజయ్, లక్ష్మణ్ తదితర నాయకులను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి పార్టీ విషయాలపై చర్చించారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మాట్లాడారు. నేతలను కలిసిన వారిలో నాయకులు శివరాజు, రాజేందర్ రెడ్డి, సతీష్, వివేకానందరెడ్డి ఉన్నారు.

● **వికారాబాద్:** డ్రైవర్స్ డేను పురస్కరించుకొని వికారాబాద్ ఆర్టీసీ డిపోలో వేడకలు నిర్వహించారు. రవాణా శాఖ అధికారి జోసెఫ్, డీఎం బక్షి నాయక్ డ్రైవర్లకు గులాబీ పూలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రాల్లో నేడు కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్డీవో ఎం.శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ర్యాలీలు, మానవహారం, ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించాలన్నారు.

● **నవాబుపేట:** 317 జీవో బాధితులకు ప్రభుత్వం న్యాయం చేసేలా కృషి చేస్తామయని టీపీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ అన్నారు. నవాబుపేటలో యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. మండల శాఖను ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా శివకుమార్, గోపాల్‌రెడ్డి, వనిత, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సభ్యులు అంజయ్య, ప్రవీణ్, గోవిందమ్మ, బాలరాజేశ్వరి ఎన్నికయ్యారు.

● **పరిగి:** గిరిజన కోటాలోని ఎంపిక చేసిన ఆరోగ్య కార్యకర్తలకు న్యాయం చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ కోరారు. గిరిజన సంక్షేమ శాఖ ఆరోగ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 22మంది గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 15మందిని ఎంపిక చేశారని తెలిపారు. అయితే వారికి ఇప్పటి వరకు జీతాలివ్వడం లేదన్నారు. ఈ ఆరోగ్య కార్యకర్తలకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సంఘం నాయకులు గణేశ్‌నాయక్, అంబర్‌సింగ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **పరిగి:** విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని పరిగి సీఐ వెంకటరామయ్య అన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా బుధవారం పరిగి ఆర్టీసీ డిపోలో ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. సీఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపేప్పుడు ఏకాగ్రత, చైతన్యంతోనే ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. డ్రైవర్ బాధ్యత చాలా గొప్పదని, ఒక్కో బస్సులో 50మందికిపై ప్రయాణికులుంటారని, అంటే వారందరి కుటుంబాలు డ్రైవర్ చేతిలో ఉన్నట్లు గుర్తించి నడిపించాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

నవాబుపేట, జనవరి 24: గ్రామాల అభివృద్ధికి తన శాయశక్తులా కృషిచేస్తానని చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం ముబారక్‌పూర్, గొల్లగూడ, నారెగూడ, దాదాపూర్ గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. నవాబుపేట మండలాన్ని ఆదర్శంగా తీర్చిదుద్దాతనన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు చిట్టెపు బాలమణి, మల్లారెడ్డి, ఆనంద్‌రెడ్డి, పరమయ్య, శ్రీనివాస్‌గౌడ్, బల్వంతరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు రంగారెడ్డి, తలారి ప్రభాకర్, ఎల్లకొండ కావలి గోపాల్, ఎంపీడీవో సుమిత్రమ్మ, పీఆర్ ఏఈ లక్ష్మయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ తిరపతిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ముబారక్‌పూర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

'బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ పూజారిపై చర్యలు తీసుకోవాలి'


వికారాబాద్, జనవరి 24: తాండూరులో ఓ బాలికపై లైంగిక దాడిచేసిన ఆలయ పూజారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి వై.గీత బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్లో కేసు నమోదు కాకుండా అడ్డుపడ్డ వారిపైనా చర్యలు తీసుకోవాలని, తాండూరులో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన పట్ల పోలీసులు వెంటనే స్పందించాలని పేర్కొన్నారు. బాలిక కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. నిందితుడిని అరెస్ట్ చేయకుంటే పీఓడబ్ల్యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాధితులకు ఉండగా న్యాయపోరాటం చేస్తామని గీత తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, యూటీఎఫ్ నాయకులు

పరిగి, జనవరి 24: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. టీఎస్‌యూటీఎఫ్-2024 క్యాలెండర్‌ను బుధవారం పరిగిలో ఎమ్మెల్యే విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలో ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలను నోటిఫికేషన్ ఇవ్వనుందని తెలిపారు. టీచర్లు బాధ్యతగా పనిచేసి మంచి ఫలితాలు తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో హరిశ్చంద్ర, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాములు, లేడీ వింగ్ ఉపాధ్యక్షురాలు జమున, కె.వెంకటయ్య, మోహిజ్ ఖాన్, గంగాధర్, శంకర్‌రావు, మెగ్యా, హన్మంత్, మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రామిక యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



కొడంగల్, జనవరి 24: దళిత బహుజన శ్రామిక యూనియన్ 2024 క్యాలెండర్‌ను బుధవారం క్యాంప్ కార్యాలయంలో కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ డీబీఎస్ బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, స్వప్న, వీరేశ్, అంజిలయ్య, వెంకటమ్మ, శేఖర్, శకనప్ప, తిమ్మప్ప, అనంతయ్య, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఎస్సైకి సీఐ, యువకుల సన్మానం



మేడ్చల్ టౌన్, జనవరి 24 : విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై నర్సింహాగౌడ్‌ను పలువురు పట్టణ యువకులు, సీఐ బి.నర్సింహారెడ్డి బుధవారం సన్మానించారు. ఉత్తమ సేవలందించే అధికారులకు ప్రభుత్వం ఏటా అవార్డులు అందజేస్తోంది. ఈ సంవత్సరం మేడ్చల్ ఎస్సై నర్సింహాగౌడ్ ఎంపికయ్యారు. ఆయన ఇటీవల సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆయన్ను సత్కరించారు. కేబీఆర్ టీమ్, ద లైఫ్ జిమ్, అవని బిల్డర్స్ ప్రతనిధులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి కాంగ్రెస్ నాయకుల సత్కారం



బొంరాస్‌పేట్, జనవరి 24: బొంరాస్‌పేట్ నూతన ఎస్సై అబ్దుల్ రవూఫ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సన్మానించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ.రఫీ, బెస్త రమేశ్, ఎండీ.అలీ తదితరులు పాల్గొన్నారు.

కన్వెన్షన్‌ను ప్రారంభించిన ఎంపీ, నాయకులు

బంట్వారం(కోట్‌పల్లి), జనవరి 24 : కోట్‌పల్లి మండలం కరీంపూర్ సమీపంలోని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, కరీంపూర్ సర్పంచ్ సుందరి అనిల్ నూతనంగా నిర్మించిన అల్‌మైటీ కన్వెన్షన్ హాల్‌ను బుధవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. అలాగే అనిల్ కుమారుడి పుట్టినరోజు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కన్వెన్షన్ ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన సేవలందుతాయని నేతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, రాంచంద్రారెడ్డి, దశరథ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం


ఘటనా స్థలంలో మృతిచెందిన సత్తార్

కీసర రూరల్, జనవరి 24 : మేడ్చల్ జిల్లాలో బుధవారం వేర్వేరు చోట్ల జరిగి రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. దుర్ఘటనల వివరాలిలా ఉన్నాయి. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ సత్తార్(70) నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీలో ఉంటూ అంకిరెడ్డిపల్లిలో ప్రీకాస్ట్ వాల్ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. పనినిమిత్తం అతడు స్కూటీపై కీసరకు వచ్చిన తిరిగి అంకిరెడ్డిపల్లికి వెళ్తున్నాడు. కీసర పల్లెదవాఖానా సమీపంలో అతడు రోడ్డుపై పడిపోయాడు. హెల్మెట్ పగిలిపోయింది. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. సత్తార్ వాహనం స్కిడ్ అయి పడ్డాడా? లేక ఏదైనా వాహనం ఢీకొందా అనేది పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సత్తార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి ...

మేడ్చల్ టౌన్: పట్టణ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన శ్రీనాథ్(34) బుధవారం తన స్నేహితుడితో కలిసి బైక్‌పై మేడ్చల్‌లోని ముకుంద్ థియేటర్ వద్ద హైవేపై నుంచి తూప్రాన్ వైపునకు వెళ్తున్నాడు. వారిని వెనక నుంచి లారీ ఢీకొంది. దీంతో బైక్ వెనక కూర్చున్న శ్రీనాథ్ తీవ్ర గాయాలతో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండిళ్లలో చోరీ.. బంగారం, నగదు అపహరణ


దొంగలు చిందరవందరగా పడేసిన దుస్తులు

వికారాబాద్, జనవరి 24 : తాళం వేసి ఉన్న రెండిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన వికారాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పాత గంజ్‌లో అద్దెకుండే మల్లికార్జున్, పుష్పలత ఇళ్లకు తాళం వేసి వారి సొంతూళ్లకు వెళ్లారు. దొంగలు మంగళవారం రాత్రి ఈ రెండిళ్లలో చోరీ చేశారు. మల్లికార్జున్ ఇంట్లో 20 తులాల వెండి, రూ.30వేలు, పుష్పలత ఇంట్లో బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీను తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా.. ట్రాక్టర్ల సీజ్



తాండూరు, జనవరి 24:పాత తాండూరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం మైన్స్ ఏడీ జాకబ్ సీజ్ చేసి ట్రాక్టర్‌పై కూర్చొని వెళ్లి పోలీసులకు అప్పగించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకే ఇసుక తరలింపు అనుమతులున్నాయి. పాత తాండూరు నంది నుంచి రాత్రిపూట ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మైన్స్ ఏడీ వెళ్లి ట్రాక్టర్లను పట్టుకున్నారు.